క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

మాడుగుల రూరల్ : ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు మంగళవారం నుంచి ఈ నెల 28 వ తేది వరకు జరుగుతాయని ఎంపీడీవో కొంకి అప్పారావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో పోతనపూడి, అవురువాడ, జాలంపల్లి, తాటిపర్తి, సచివాలయాల్లో, 20, 21 తేదీల్లో వి.వి.అగ్రహారం, పొంగలిపాక, జె.డి.పేట, ఎం.కోడూరు సచివాలయాల్లో, 24న జి.అగ్రహారం, ఒమ్మలి, సత్యవరం, సాగరం, 25 న ఎం.కోటపాడు, జి.అగ్రహారం, ఒమ్మలి, సత్యవరం, 27, 28 తేదీల్లో శంకరం, వీజేపురం, మాడుగుల-1, ముకుందపురం, గ్రామ సచివాలయాల్లో జరిగే ఆధార్ నమోదు క్యాంపుల్లో 6 సంవత్సరాల లోపు చిన్నారులకు నమోదు చేస్తారన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట : మండల కేంద్రంలో అడవి రాజుల బాబు పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు తరలి వచ్చి పూజలు చేసుకున్నారు. నిర్వాహకులు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు కె.నాయుడుపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐ

4న మోదకొండమ్మ తీర్థం



పూలు, నగలతో అలంకరించిన మోదకొండమ్మ తల్లి

మాడుగుల: వచ్చే నెల 4 వ తేదీన ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం అత్యంత వైభవంగా జరగనుందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. తీర్థ మహోత్సవం నిర్వహణకు సంబంధించి కమిటీ సోమవారం సమావేశం అయింది. ఈ ఏడాది తీర్థం అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

గొలుగొండ : గొలుగొండ బాలయోగి గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత, రాత పరీక్ష పెట్టి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న యర్రాపాత్రుడు, బాలకృష్ణ

మాకవరపాలెం : సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గిడుతూరులో సాయిబాబా ఆలయం నిర్మించి 20 ఏళ్ల పూర్తి కావడంతో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మూకల బాలకృష్ణ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



బండి శ్రీను (ఫైల్)

చోడవరం : చోడవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ బండి నూకాలమ్మ భర్త బండి శ్రీను (60) సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైఎస్సార్‌సీపీలో చోడవరం పట్టణంలో నాయకుడుగా ఉన్నారు. రెల్లి సంఘం జిల్లా ప్రతినిధిగా ఉంటూ రెల్లి కులస్తుల సంక్షేమానికి కృషి చేశారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

• శంకుస్థాపనలతో సరి...?

రోడ్లెప్పుడు వేస్తారు... అధ్యక్షా!

సుందరకోట, అసనగిరి మధ్య మట్టిరోడ్డు



గత ఏడాది సుందర కోట - అసనగిరి తారురోడ్డుకు శంకుస్థాపన

శృంగవరం నుంచి గన్నవరం వరకు రోడ్డు విస్తరణ

డిసెంబర్ 3న స్పీకరు అయ్యన్న, కలెక్టరు భూమి పూజ

తమ గ్రామానికి తారురోడ్డు వస్తుందని ఆశతో గిరిజనుల ఎదురుచూపులు

నాతవరం : అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్భాటంగా రోడ్డు పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు, మండలంలో సుందరకోట గ్రామంలో గత ఏడాది స్పీకరు రూ 2 కోట్లు 5లక్షలు నాబార్డు నిధులతో తారురోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో సుందరకోట నుంచి అసనగిరి గ్రామాల మధ్య మట్టి రోడ్డును తారు రోడ్డుగా నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో ఈ రెండు గ్రామాల మధ్య కొంత రోడ్డును రూ. 25లక్షలతో మెటల్ రోడ్డుగా వేయగా ప్రస్తుత ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణానికి స్పీకరు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పనులు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇంతవరకు రోడ్డు పనులు చేయలేదు. స్పీకర్ శ శంకుస్థాపన చేయడంతో తారురోడ్డు వేగంగా వేసేస్తారు...అని గిరిజనులు ఆనందపడ్డారు, తారురోడ్డు వేస్తే మా అసనగిరి గ్రామంలోకి రవాణా సదుపాయం మెరుగుపడుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే నర్సీపట్నం, తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డును నాతవరం మండలంలో రోడ్డు విస్తరణకు రూ.12కోట్లతో డిసెంబర్ 3వ తేదీన స్పీకరు అయ్యన్నపాత్రుడు, కలెక్టరు విజయకృష్ణన్ స్వయంగా భూమి పూజ చేశారు. ఈ రోడ్డు శృంగవరం గ్రామం నుంచి కాకినాడ జిల్లా సరిహద్దు గన్నవరం మెట్ట వరకు నాలుగు కిలో మీటర్లు రోడ్డు విస్తరణ పనులు చేయాలి. మధ్యలో వెదుళ్లగెడ్డపై రెండు చోట్ల వంతెనలు నిర్మించాలి. ఈ పనులు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేయాలి. ఈ రోడ్డు పనులు సైతం ఇంత వరకు ప్రారంభించలేదు. స్పీకరు, కలెక్టరు స్వయంగా ఈ రెండు రోడ్ల కోసం శంకుస్థాపన, భూమి పూజ చేసిన సమయంలో రోడ్డు పనులు నాణ్యంగా చేయాలని, తనకు ఎలాంటి చెడ్డ పేరు రాకుండా అధికారులు బాధ్యతగా చేయాలని సభలో సూచించారు. ఈ రోడ్డు పనులు జాప్యం చేయకుండా చేసేందుకు కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అయితే అధికారులు ఇప్పటి వరకూ నిర్మాణం పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. స్పీకర్, కలెక్టర్ స్వయంగా భూమి పూజ చేసిన పనుల సంగతే ఇలా ఉంటే, జిల్లాలో మిగిలిన అభివృద్ధి పనుల గతేమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటామన్న అధికారులు

సుందరకోట అసనగిరి మధ్య తారు రోడ్డు నిర్మాణం పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని, ఇందుకు మిషనరీ సుందరకోటకు తరలిస్తామని పంచాయతీ రాజ్ స్పెషల్ వర్క్స్ డీఈ సత్యనారాయణ తెలిపారు. శృంగవరం నుంచి జిల్లా సరిహద్దు గన్నవరం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని కాంట్రాక్టరుపై ఒత్తిడి తీసుకువస్తున్నామన్నారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణ రెడ్డి తెలిపారు.



గత ఏడాది డిసెంబరు 3తేదీన శృంగవరం గన్నవరం మెట్ట రోడ్డు విస్తరణకు భూమిపూజ చేస్తున్న స్పీకరు అయ్యన్నపాత్రుడు, కలెక్టరు విజయకృష్ణన్



గత ఏడాది అసనగిరికి తారురోడ్డు నిర్మించేందుకు సుందరకోటలో శంకుస్థాపన చేస్తున్న స్పీకరు అయ్యన్న (ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోండి

మాడుగుల రూరల్ : ఈ నెల 27 వ తేదిన జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, స్థానిక తహసీల్దారు కె.రమాదేవి కోరారు. ఈ ఎన్నికలకు సంబంధించి మండలంలో స్థానికంగా 55 మంది ఓటు హక్కు కలిగివున్నారని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 86వ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవి కోసం 10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు.

2760 మంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి

మాకవరపాలెం : ఫార్మర్ రిజిస్ట్రీని రైతులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 2760 మంది రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేశామన్నారు. రైతులంతా ఈ నెల 25లోగా రైతుసేవా కేంద్రాల్లో నమోదు పూర్తి చేయించుకోవాలన్నారు.

నేడు తంగుడుబిల్లిలో జిల్లాస్థాయి గుర్రాల పోటీలు

చీడికాడ : మండలంలోని తంగుడుబిల్లిలో అభయాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు అర్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2గంటలకు గుర్రపు పోటీలు ప్రారంభమౌతాయని, రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

పెరటి కూరల సాగు ఎంతో మేలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీఎం ప్రభాకరరావు, ఏపీవో చంద్రకళ

దేవరాపల్లి : ప్రతి ఇంటి పెరటిలో సేంద్రియ ఎరువులతో కాయగూరలు, ఆకు కూరలు, తీగ, దుంప జాతి మొక్కలను సాగు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. దేవరాపల్లిలో వెలుగు ఏపీఎం ఎస్ ప్రభాకరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన గ్రామైక్య సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకొని, ఆరోగ్యకరమైన కాయగూరలు పండించుకోవాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో కాయగూరలు పండించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఏపీఎం ప్రభాకరరావు మాట్లాడుతూ హోమ్ కంపోస్టు కింద ఇంటిలో చెత్త నుంచి ఎరువు తయారు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ ఏపీవో చంద్రకళ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన అర్హులందరికీ హోమ్ కంపోస్ట్ కట్టించేందుకు పేమెంట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, వెలుగు సీసీలు గౌరీశ్వరరావు, వీవోలు సృజన, వెంకటలక్ష్మి, గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



కాశీపురం హైస్కూల్‌లో దాతలు అందించిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు ఆదిరెడ్డి వరలక్ష్మి తన తాత ఆదిరెడ్డి సత్యం జ్ఞాపకార్థంగా పాఠశాల అభివృద్ధికి బావ ఆదిరెడ్డి నాయుడుతో కలిసి రూ.3,500 నగదుతో పాటు సుమారు రూ.5 వేలు విలువ చేసే క్రీడా సామాగ్రిని సమకూర్చారు. స్థానిక హైస్కూల్లో సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి చేతుల మీదుగా హెచ్‌ఎం సుందరికి నగదును, క్రీడా దుస్తులను సోమవారం అందజేశారు. దాతలను హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ అభినందించారు.

వేసవిలో తాగునీటి సమస్య నివారణ



బోర్లు సామగ్రితో కూడిన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు, ఏఈ చంద్రశేఖర్

దేవరాపల్లి : వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధంగా చేశామని దేవరాపల్లి ఎంపీడీవో సువర్ణరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మంచినీటి బోర్లు, పథకాల మరమ్మతులకు అవసరమైన సామాగ్రితో కూడిన మొబైల్ వాహనాన్ని ఎంపీడీవో సువర్ణరాజు, ఏవో లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ ప్రారంభించారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మంచినీటి బోర్లను పరిశీలించి మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయిస్తామని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో జల్‌జీవన్ జీవన్ మిషన్‌లో 150 పనులకు 96 పనులను పూర్తి చేశామన్నారు. 27 పంచాయతీల పరిధిలోని 96 గ్రామాలకు 65 గ్రామాల్లో ఇంటింటి కుళాయి నీటిని సరఫరా చేయడం జరిగిందన్నారు. రక్షిత నీటి పథకాల వద్ద ఆటోమెటిక్ క్లోరినేషన్‌కు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పనిభారం పెంచారు..జీతాలు పెంచరేం..!

అంగన్‌వాడీల ఆందోళన



మాడుగులలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



మాడుగులలో సీడీపీవోకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



నర్సీపట్నం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రావికమతం ఐసీడీఎస్ పీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మాడుగుల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయు, మాడుగుల ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సభ్యులు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి సీడీపీవో శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి, జానకి, యూనియన్ ప్రెసిడెంట్ ఆర్.రామలక్ష్మి, సభ్యులు ఎన్.కొండాజీ, బి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గతంలో ఏర్పాటు చేసిన మినిట్స్ హామీలు ఒక్కటీ కూడా నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. అనేక సార్లు నిరసనలు చేపట్టినా సరే నేటి వరకు జీతం పెంచలేదన్నారు. అనేక యాప్‌లు ప్రవేశపెట్టి పని భారం పెంచుతున్నారు తప్ప తమ వేతనాలు పెంచలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రాట్యూటీకి అర్హులేనని సుప్రీంకోర్టు 2022లో తీర్పు ఇస్తే ఆ తీర్పుకు అనుగుణంగా చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు మరణిస్తే అంత్యక్రియలకు రూ.20 వేలు ఇవ్వవలసి ఉండగా రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటరు బిల్లులు, టి.ఎ బిల్లులు, ఈవెంట్స్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో శ్రీదేవికి వినతి పత్రం అందజేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు, మండల నాయకులు ఇరటా నరసింహమూర్తి, ఆర్.దేముడు నాయుడు, కె. భవాని, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలుకు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లకు నిర్దిష్ట విధి విధానాలు రూపొందించాలని అన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కారాలకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కేంద్రాల అద్దె బకాయిలు, టీఏ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఆర్.రమణమ్మ, కార్యదర్శి మహాలక్ష్మి, పి.వరలక్ష్మి, కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

రావికమతం : తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు అందజెయ్యాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ప్రీస్కూలును బలోపేతం చేయాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ రద్దు చేసి, పనిభారం తగ్గించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, గ్రాట్యూటీ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. యూనియన్ ప్రతినిధి సత్యవేణి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని అన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు దిబ్బిడి విద్యార్థిని



యమునను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

బుచ్చెయ్యపేట : జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని శనివాడ యమున పాల్గొంది. మహారాష్ట్రలోని గ్వాలియర్ పట్టణం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ నెల 14 నుంచి జాతీయ స్థాయి రగ్బీ పోటీలు జరుగుతున్నాయి. 9వ తరగతి చదువుతున్న యమున జనవరిలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. దీంతో యమునను జాతీయ స్థాయిపోటీలకు ఎంపిక చేశారు. ఆమె ఎంపికపై పాఠశాల హెచ్‌ఎంసత్యారావు, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పేట శివాలయంలో అన్నసమారాధన



పేట శివాలయంలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట : విజయరామారాజుపేట శివాలయంలో సోమవారం అన్న సమారాధన జరిగింది. గ్రామానికి చెందిన దాడి ఆనంద్ దంపతుల ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. శివాలయంలో ప్రతి సోమవారం అన్నసమారాధన చేయడానికి పలువురు భక్తులు ముందుకొస్తున్నారని గ్రామ నాయకులు తెలిపారు. ముందుగా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద ప్రతి సోమవారం శివాలయంలో అన్న సమారాధన చేయాలని పూనుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి సోమవారం దాతలు శుభ కార్యక్రమాల సందర్భంగా శివాలయంలో అన్నసమారాధనకు చొరవ చూపాలని గ్రామ నాయకులు తెలిపారు.

రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా వంతెన



సింగన్నదొరపాలెం సమీపంలో గల రక్షణ గోడలు లేని వంతెన

కె.కోటపాడు : సింగన్నదొరపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో గల మొండిగెడ్డపై వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. గత 20 ఏళ్లక్రితం నిర్మించిన ఈ వంతెనకు నిర్మించిన రక్షణ గోడలు మరామ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రస్తుతం వంతెనకు రెండువైపులా గల రక్షణ గోడలు కనుమరుగయ్యాయి. వంతెనకు రెండు వైపుల లోతట్టు ప్రాంతాలు ఉండడం వలన వంతెనపై ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో వంతెన ఇరుకుగా ఉండడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. రక్షణ గోడలు నిర్మాణం చేపట్టి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

మందుబాబులపై కేసులు

అనకాపలి టౌన్: బహిరంగ ప్రదేశాలో మద్యం సేవిస్తున్న వ్యక్తులపై పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. అనకాపల్లి స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి డాబాలు, బహిరంగ ప్రదేశాలలో దాడులు నిర్వహించి, మద్యం సేవిస్తున్న 25 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఈ దాడులలో ట్రైనీ డీఎస్పీ ఎం.వి. కృష్ణచైతన్య, టౌన్ ఎస్ఐ డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట, నేలకు మేలు



ఖండివరంలో రైతు పొలంలో ప్రకృతి సేద్యంలో సాగవుతున్న పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రకృతితో సాగుతో అటు నేలకు, ఇటు పంటకు ఎంతో మేలు జరుగుతుందని తద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ జి.దేముళ్లు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ఖండివరంలో 2020 నుంచి ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సూరెడ్డి చిన్నమ్మలు పొలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆమె సాగు చేస్తున్న నవధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ మేరకు సాగు విధానం, పెట్టుబడి, రాబడిపై ఆరా తీశారు. ప్రతి రైతు ప్రకృతి సాగువైపు రావాలని ఆయన కోరారు. ఈ మేరకు చిన్నమ్మలు మాట్లాడుతూ ప్రకృతి సాగుతో రసాయన ఎరువుల వాడకం తగ్గిందన్నారు. నేల నీటినిల్వ సామర్థ్యం పెరిగిందని గుర్తించామన్నారు. పంటలను ప్రతి సీజనకు మార్చి వేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగమణి, నాయుడుబాబు, శ్రీరామమూర్తి ఉన్నారు.

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

కొంకోట: మండలంలోని గొబ్బూరు గ్రామ పరిధిలోని రెండు చెరువుల్లో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతు బుద్ధ వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. గొబ్బూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా గైరమ్మ, కారిపాలెం చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. గైరమ్మ చెరువును ఆక్రమించి రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు సర్వీసు రోడ్డు నిర్మిస్తుండగా, కారి పాలం చెరువును రియల్టర్లు, ఇతరులు దాదాపు సగం మేర ఆక్రమించి చదును చేశారన్నారు. వీటికి వచ్చే సాగునీటి కాలువలను కొంత మేర పూడ్చి వేశారన్నారు. దీంతో సాగునీరు అందక నష్టపోతున్నామని వాపోయారు.

20న జీడి మామిడి ఫలసాయానికి వేలం

నల్బువరం: మండలంలోని లింగాలతిరుగుడులో వేంచేసిన సోమలింగేశ్వస్వామివారి దేవస్థానానికి చెందిన జీడి మామిడి తోట ఫలసాయం అనుభవించుటకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.79లో 3.50 ఎకరాల విస్తీర్ణంలోని జీడి మామిడి తోట ఫలసాయం ఏడాదికి గాను, సర్వే నెం.70/7, 70/11లలోని 3.60 ఎకరాల జీడి మామిడి తోట మూడేళ్ల కాలానికి హక్కుల కోసం ఈ వేలం పాట జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలాన్ని దేవస్థానం వద్ద ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

నేడు నల్లమారమ్మతల్లి జాతర

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ బీఆర్టీ కాలనీలో మంగళవారం నిర్వహించే నల్లమారమ్మతల్లి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రతినిధి రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, సత్యనారాయణపురం, పిసినికాడ పంచాయతీ భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశామన్నారు.